సాక్షి చిత్తూరు

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



వేడుకగా ప్రదోష పూజలు

పిచ్చాటూరు: సురుటపల్లి శ్రీపల్లికొండేశ్వరాలయంలో త్రయోదశిని పురస్కరించుకొని ప్రదోష పూజలు సోమవారం వేడుకగా నిర్వహించారు.



మృత్యుంజయ స్వామికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర జరగనుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం(సా)	సహర్ బుధవారం(ఉ)
తిరుపతి	6.28	4.46
చిత్తూరు	6.30	4.46
పుంగనూరు	6.32	4.49

న్యూస్‌రీల్

పోలీసు 'స్పందన'కు 15 వినతులు



అర్జీలు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ జగదీష్

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మొత్తం 15 వినతులు వచ్చాయి. అడిషనల్ ఎస్పీ జగదీష్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిలిగిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

పంట పొలాల్లో గజ బీభత్సం



ఏనుగు తొక్కేసిన బీరతోటను చూపుతున్న రైతు

గంగవరం : మండలంలోని కీలపట్ల పంచాయతీలో ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది . గాంధీనగర్ సమీపంలోని పంట పొలాలను తొక్కి నాశనం చేసింది. మామిడి, కొబ్బరి చెట్లను వేర్లతో సహా పెకలించివేసింది. పశువుల పాకను కూల్చేసింది. ఏనుగు దాడితో తీవ్రంగా నష్టపోయినట్లు బాధిత రైతులు నీలకంఠ, నారాయణమ్మ, రామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పరిహారం అందించాలని కోరుతున్నారు.

జిల్లాకు చేరిన విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జగనన్న కాలనీలు, నూతన సర్వీసులకు అవసరమైన విద్యుత్ పరికరాలు జిల్లా స్టోర్స్‌కు వచ్చినట్లు నిర్మాణ విభాగం ఈఈ రమణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు–10, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు– 25, 3 ఫేజ్ మీటర్లు–1000 వచ్చినట్లు వివరించారు. అలాగే సబ్‌స్టేషన్స్ కోసం 11 కేవీ ఫీడర్లు–20 వచ్చాయన్నారు. స్టోర్‌లో ఇప్పటికే 60 వేల మీటర్లు ఉన్నట్లు వివరించారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్: వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మే 1 నుంచి 31 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 5వతేదీ లోపు దరఖాస్తులను 7013046094 నంబర్‌కు వాట్సాప్ ద్వారా, నేరుగా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.


గిరిజన పంచాయతీల అభివృద్ధికి వినతి



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: నూతనంగా ఏర్పడిన గిరిజన పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు విన్నవించారు. సోమవారం విజయవాడలోని కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి కమిషనర్ కోన శశిధర్‌కు వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ, ఆరోగ్యకేంద్రం, రైతుభరోసా కేంద్రం భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, పెద్దతాండా సర్పంచ్ మోహన్ నాయక్, రెస్కో డైరెక్టర్ రవినాయక్, వైఎస్సార్ సీపీ నేతలు మురుగేష్, చిన్నరాజునాయక్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రుణం.. సహకారం!



గతంలో అలంకారప్రాయంగా మారిన సహకార రంగానికి ప్రభుత్వం పునరుజ్జీవం పోసింది.. ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి డీసీసీ బ్యాంకులను బలోపేతం చేసింది.. పకడ్బందీగా లక్ష్యాలను నిర్దేశించి విరివిగా రుణాలు మంజూరు చేయిస్తోంది. ఇటు రైతులకు.. అటు డ్వాక్రా సంఘాలకు తక్కువ వడ్డీకే లోన్లు అందించేలా చర్యలు చేపట్టింది. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించిన వారికి సున్నావడ్డీని అమలు చేస్తోంది. అలాగే వ్యవసాయ యాంత్రీకరణకు సైతం సహకార బ్యాంకుల ద్వారా ఊతం అందిస్తోంది.

- డీసీసీ బ్యాంకుల ద్వారా విశిష్ట సేవలు
- వ్యవసాయ రంగానికి తోడ్పాటు
- డ్వాక్రా సంఘాలకు వెన్నుదన్ను
- తక్కువ వడ్డీకే విరివిగా రుణాల మంజూరు
- సకాలంలో చెల్లిస్తే సున్నావడ్డీ అమలు

చిత్తూరు అగ్రికల్చర్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మొత్తం 38 సహకార కేంద్ర బ్యాంకు శాఖలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వీటికి తగిన ప్రోత్సాహం లేకపోవడంతో నామమాత్రంగా రుణాలు అందిస్తూ ఉండేవి. దీంతో రైతులకు సహకార రంగంపై పూర్తిగా నమ్మకం సన్నగిల్లింది. ప్రైవేటు బ్యాంకులు, వ్యక్తులపై ఆధారపడి అధిక వడ్డీలకు రుణాలు పొందాల్సిన దుస్థితి ఉండేది. రుణాలకు వడ్డీలు కట్టలేక రైతులు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి. ఇలాంటి తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సహకార రంగానికి అన్నివిధాలా తోడ్పాటును అందించింది. రైతులకు , డ్వాక్రా సంఘాలకు 9 శాతం తక్కువ వడ్డీతో, ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజులు లేకుండా విరివిగా రుణాలను అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

లక్ష్యాలను అధిగమిస్తూ

2019–20 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ. 950 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా, 72 వేల మంది రైతులకు రూ.985 కోట్లను డీసీసీ బ్యాంకు మంజూరు చేసింది. 2020 –21 లో రూ. 1,040 కోట్ల రుణాల లక్ష్యానికి గాను 75వేల మంది రైతులకు రూ. 1,100 కోట్లు అందజేసింది. 2021–22లో రూ.1,200 కోట్ల లక్ష్యానికి గాను 80వేల మంది రైతులకు రూ. 1,250 కోట్ల రుణాలను అందజేసింది. 2022–23లో రూ.1,380 కోట్లకు గాను 84 వేల మంది రైతులకు రూ.1,380 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.లక్షలోపు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేస్తే సున్నావడ్డీని వర్తింపజేస్తోంది.

డ్వాక్రా సంఘాలకు చేయూత

జిల్లాలోని డ్వాక్రా సంఘాలకు విరివిగా రుణాలు అందించేందుకు సహకార బ్యాంకులు ముందుకు వచ్చాయి. వీరికి ఎలాంటి ప్రాసెసింగ్ , ఇన్సూరెన్స్ ఫీజులు లేకుండా రుణాలు ఇస్తున్నాయి. జగనన్న తోడు కింద చిరు వ్యాపారులకు రూ. 10 కోట్ల మేర రుణ సాయాన్ని అందించాయి. ఇవిగాక డ్వాక్రా మహిళలు వ్యక్తి గత రుణాలను కూడా సహకార బ్యాంకు ద్వారా పొందుతున్నారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

- మొత్తం డీసీసీ బ్యాంకు బ్రాంచ్‌లు **38**
- ఖాతాదారులైన రైతులు **1.10** లక్షల మంది
- మూడేళ్లలో అందించిన పంట రుణాలు రూ.**4,715** కోట్లు
- రుణాలు పొందిన డ్వాక్రా సంఘాలు **2,070**
- మంజూరైన మొత్తం రూ.**111** కోట్లు



జిల్లా సహకార కేంద్ర బ్యాంక్

వ్యవసాయ యాంత్రీకరణకు సాయం

పంటల సాగుకు అవసరమైన యంత్ర పరికరాలు, ట్రాక్టర్ల కోసం కూడా సహకార బ్యాంకుల ద్వారా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తోంది. ఇప్పటికే 1,150 కస్టమ్ హైరింగ్ సెంటర్లకు గాను రూ. 60 కోట్ల మేర రుణాలు అందించింది. అందులో 365 ట్రాక్టర్లకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందించిన రుణాలను సహకార బ్యాంకుల ద్వారా అందజేశారు. ఇవిగాక పట్టు పరిశ్రమ అభివృద్ధికి కూడా సహకార బ్యాంకుల ద్వారా తోడ్పాటును అందిస్తున్నారు. పట్టు పురుగుల పెంపకం కోసం షెడ్డుకు రూ. 5 లక్షల మేర 7 శాతం వడ్డీతో రుణాలు ఇస్తున్నారు. మల్బరీ సాగుకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున రుణాలు మంజూరు చేస్తున్నారు. డెయిరీ, పౌల్ట్రీ ఫాం ఏర్పాటు, పాడి ఆవులు, గొర్రెలు పెంపకానికి కూడా రుణసాయం లభిస్తోంది.

బ్యాంకు సేవలు ఇలా..

సహకార బ్యాంకులు ఖాతాదారులు విశిష్టమైన సేవలు అందిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 60 ఏటీఎంలు ఏర్పాటు చేసింది. రెండు మొబైల్ ఏటీఎంలు కూడా ఖాతాదారులకు సర్వీసును అందిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని సహకార బ్యాంకులు రూ. 1,540 కోట్ల అవుట్ స్టాండిగ్‌తో అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నాయి.

అద్భుతమైన ప్రయోజనాలు



సహకార బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు అద్భుతమైన ప్రయోజనాలు అందిస్తున్నాం. అతి తక్కువ వడ్డీతోనే విరివిరిగా రుణాలు మంజూరు చేస్తున్నాం. ఎటువంటి బలవంతపు డిపాజిట్ల సేకరణ కానీ, ప్రాసెసింగ్ చార్జెస్ వసూలు చేయడం లేదు. రుణాలపై ప్రభుత్వం అందించే అన్ని రాయితీలను ఖాతాదారులకు నేరుగా జమ చేస్తున్నాం.

– మొగసాల రెడ్డెమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్

సంతోషంగా ఉంది



సహకార బ్యాంకుల ద్వారా అడిగిన వెంటనే తక్కువ వడ్డీకే రుణాలు అందించడం చాలా సంతోషంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సహకార బ్యాంక్ ద్వారా రుణాల పొందడం కష్టంగా ఉండేది. రైతులను అన్ని విధాల ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– రామ్మూర్తిరెడ్డి, కార్వేటినగరం

మరింత వేగంగా ఇళ్ల నిర్మాణం



వర్చువల్ కాన్ఫరెన్స్‌లో జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం వర్చువల్ విధానంలో క్షేత్రస్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 28,100 గృహ నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో అధిగమించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా రెండో దశ నాడు–నేడు పనులను 1,103 పాఠశాలల్లో ప్రారంభించినట్లు వెల్లడించారు. మార్చి 15 నుంచి రెండు విడతలుగా రూ. 48.8 కోట్లు విడుదల చేశామన్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలలకు రివాల్వింగ్ ఫండ్ ఉందని తెలిపారు. పాఠశాలల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సమావేశంలో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట రమణారెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఈఓ విజయేంద్రరావు పాల్గొన్నారు.

నయనం ప్రధానం

నగరి : పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం శంకర్ నేత్రాలయ, రోజా చారిటబుల్ ట్రస్ట్ వారు నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శిబిరానికి మొత్తం 350 మంది హాజరయ్యారు. సుమారు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 53 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం రోగులకు భోజన సౌకర్యం కల్పించారు.



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పవిత్రం.. పరిమళభరితం



భక్తకోటి మొక్కులను తీరుస్తూ అలసిన శ్రీవారు సేదతీరేలా.. ఆశ్రితజన రక్షణలో సొలసిన వైకుంఠనాథునికి ఉపశమనం లభించేలా.. గ్రీష్మతాపంతో స్వామి సొమ్మసిల్లకుండా తిరుమలలో వసంతోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ మేరకు శాస్త్రోక్తంగా వేడుకలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి విశేష ద్రవ్యాలతో తిరుమంజనం జరిపించారు.

– తిరుమల

తొలిరోజు పదిలం

- ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు
- 21,481 మంది విద్యార్థుల హాజరు
- 117 మంది గైర్హాజరు



గెరింపేట మున్సిపల్ పాఠశాలలోని పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



దొడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్, డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. చీఫ్ సూపరింటెండెంట్లు సెట్ నెంబర్ 1 ప్రశ్న పత్రాన్ని కేటాయించారు. మొత్తం 115 కేంద్రాల్లో 21,658 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 21,481 మంది హాజరయ్యారు. మిగిలిన 117 మంది గైర్హాజరయ్యారు. దివ్యాంగులు, అంధులు, అనారోగ్యంగా ఉన్నవారి పరీక్షను 9వ తరగతి విద్యార్థులు రాయడానికి అధికారులు అనుమతించారు.

పకడ్బందీ బందోబస్తు..

పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా పోలీసు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐడీకార్డు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించారు. సచివాలయ మహిళా పోలీసులు సైతం కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టారు.

ఆకస్మిక తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాలను జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈఓ విజయేంద్రరావు, అబ్జర్వర్ మువ్వా రామలింగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా సజావుగా పరీక్షలను నిర్వహించేందుకు సూచనలు చేశారు. డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ జరగలేదన్నారు.

జెడ్పీ చైర్మన్ పరిశీలన

చిత్తూరు నగరంలోని పీసీఆర్ జూనియర్, కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలికవసతులు కల్పించాలని ఆదేశించారు.



విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రం వద్ద విధుల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పక్కాగా బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పది పరీక్షలకు 991 మందికిగాను 946 మంది, ఇంటర్ పరీక్షలకు 3,194 మందికి గాను 3,072 మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి తెలిపారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ జరగలేదని అధికారులు వెల్లడించారు.

'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రాయోజిత పథకం మిషన్ వాత్సల్యకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం వాత్సల్య సహాయం కింద ప్రతి నెలా రూ.4వేలు అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు ఆర్థికంగా, శారీరకంగా చితికిపోయి పట్టించుకోకుంటే ఆయా పిల్లలు పథకానికి అర్హులని తెలిపారు. బాలకార్మికులు, దివ్యాంగ పిల్లలు, ఇంట్లో నుంచి పారిపోయి వచ్చినవారు, బాల యాచకులు, వీధి బాలలు, కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయినవారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దరఖాస్తులను సచివాలయ మహిళా పోలీసులకు అందించాలని సూచించారు.

సారా విక్రేతల అరెస్ట్

పుంగనూరు : మండలంలోని పట్రపల్లె తాండా, దిగువచింతవారిపల్లెలో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడులు నిర్వహించి సారా తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఊటను ధ్వంసం చేసి, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బుడ్డన్ననాయక్, మూడేఈశ్వర్ నాయక్, పి.అంజప్పను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మాధవస్వామి తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ మస్తాన్‌వలీ, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనాథరెడ్డి, నాగరాజా, గౌతమ్, దొరబాబు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఉద్యోగికి గాయాలు

గుడిపాల: మండలంలోని వసంతాపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో సింగిల్‌విండో కార్యాలయ ఉద్యోగి జితేంద్ర(40) తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మధ్యాహ్నం భోజనం తర్వాత జితేంద్ర బైక్‌పై కార్యాలయానికి వెళుతుండగా ఓ వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

బతిమాలినా కనికరించలేదు

- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్య
- నాగరాజును అతికిరాతకంగా చంపిన నిందితులు
- కారులో వేసి దహనం చేసిన వైనం
- ఇప్పటికే కొంతమందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చాణక్యప్రతాప్ కోసం ముమ్మర గాలింపు



ఘటనాస్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

చంద్రగిరి: 'నా తమ్ముడు చేసిన తప్పునకు ఏ శిక్షనైనా విధించండి.. అంతేకానీ వాడిని చంపొద్దు.. దయచేసి నన్ను కూడా వదిలేయండి.. ఏం చేయవద్దు' అని ఎంత బతిమాలినా నరరూప రాక్షసులు కనికరించలేదు. కర్కశంగా చంపేశారు. అనంతరం మృతదేహాన్ని కార్లోపడేసి దహనం చేశారు. శనివారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సజీవ దహనం కేసులో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. వెదురుకుప్పం మండలం, బ్రాహ్మణపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు నాగరాజు(35)ను అతికిరాతకంగా మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. పంచాయితీ పేరుతో రాజీ చేద్దామని పిలిపించిన టీడీపీ నాయకులు చాణక్యప్రతాప్, రిపుంజయ అతని అనుచరులు మానవత్వం మరిచి దారుణానికి ఒడిగట్టారు.

అసలేం జరిగిందంటే

సాఫ్ట్‌వేర్ ఇంజినీరు నాగరాజు తమ్ముడు పురుషోత్తంకు బ్రాహ్మణపల్లె సర్పంచ్ చాణక్య ప్రతాప్ తమ్ముడైన రిపుంజయ భార్యతో వివాహేతర సంబంధం ఉంది. విషయం తెలియడంతో వారిద్దరూ శివరాత్రి రోజున పురుషోత్తం, నాగరాజుతో గొడవకు దిగారు. అప్పటి నుంచి కక్ష పెంచుకున్నారు. పురుషోత్తంను ఎలాగైనా మట్టుబెట్టాలని నిశ్చయించుకున్నారు. విషయం తెలుసుకున్న నాగరాజు తన తమ్ముడిని బెంగళూరుకు పంపించేశాడు. ఈ క్రమంలో చాణక్య ప్రతాప్, రిపుంజయ తొలుత నాగరాజును అంతం చేయాలని ప్రణాళిక రచించారు.

బతిమాలినా వారి మనస్సు కరగలేదు

రాజీ పేరుతో నాగరాజు, చాణక్యప్రతాప్ సన్నిహితుడు గోపీ రంగంలోకి దిగాడు. నాగరాజుకు శనివారం సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత నాగరాజు, చాణక్యప్రతాప్, రింపుజయ, గోపితో పాటు మరికొంత మంది చంద్రగిరి సమీపంలోని ఓ వెంచర్‌లో మద్యం సేవించినట్లు తెలుస్తోంది. రాత్రి 10.30 గంటలకు అక్కడి నుంచి నాగరాజు కారులో రిపుంజయ, మరో ఇద్దరు, వేరే కారులో చాణక్యప్రతాప్, ఇంకో ఇద్దరు గంగుడుపల్లె కురువకణం వద్దకు బయల్దేరారు. అప్పటికే అక్కడ బొప్పరాజుపల్లెకు చెందిన మరో ముగ్గురు టీడీపీ నేతలు కారులో వచ్చి వేచిఉన్నారు. కురవకణం వద్దకు చేరుకోగానే రిపుంజయ, చాణక్య, వారి అనుచరులు నాగరాజుపై దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. తనను వదిలిపెట్టాలని చాణక్యప్రతాప్, రిపుంజయ కాళ్లుపట్టుకుని నాగరాజు బతిమలాడుతూ, పది నిమిషాల పాటు పెనుగులాట చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో నాగరాజు మెడలోని బంగారు గొలుసు, పాదరక్షలు పక్కన పడిపోయాయి. 10.45 గంటల సమయంలో ముందుగా అనుకున్నట్లే అక్కడ ఉన్న మరో ముగ్గురితో టీడీపీ నాయకులు కలిసి నాగరాజు మెడకు లుంగీ బిగించి నిర్దాక్షిణ్యంగా చంపేశారు. అనంతరం మృతదేహాన్ని కారులో పడేశారు. ఆపై కారును కురవకణం లోయలో పడేసేందుకు యత్నించారు. అయితే కారు ముందు పెద్ద రాయి అడ్డుగా ఉండడంతో వారి ప్రయత్నం ఫలించలేదు. దీంతో కారు లోపల, బయట పెట్రోల్ పోసి నిప్పంటించారు. నాగరాజు మృతదేహం పూర్తిగా దహనమైనట్లు నిర్ధారించుకున్నారు. తర్వాత చాణక్య ప్రతాప్, రిపుంజయ వారి అనుచరులతో కలిసి రెండు కార్లలో ఘటనా స్థలం నుంచి పరారయ్యారు, గోపి మరో ప్రాంతానికి పారిపోయినట్లుగా ప్రచారం జరుగుతోంది.

హత్యలో సుమారు 10 మంది పాత్రదారులు?

సాఫ్ట్‌వేర్ నాగరాజును హత్యచేసిన ఘటనలో సుమారు 10 మంది పాల్గొన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాణక్యప్రతాప్, రిపుంజయ, గోపీతో పాటు బొప్పరాజుపల్లెకు చెందిన ముగ్గురు, చాణక్యప్రతాప్‌కు చెందిన ఇద్దరు అనుచరులు, రామచంద్రాపురం మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఈ హత్యాకాండలో పాలు పంచుకున్నట్లు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో నిందితులు

నాగరాజు సజీవ దహనం కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు సమాచారం. ఇప్పటికే ప్రధాన నిందితుల్లో ఒకరితో పాటు బొప్పరాజుపల్లెకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రధాన నిందితుడైన చాణక్యప్రతాప్‌కు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు సంజీవ్ వరుసకు అన్న కావడంతో పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు చాణక్యప్రతాప్ నగరిలోని ఓ గెస్ట్ హౌస్‌లో ఉన్నట్లుగా సమాచారం. సోమవారం చాణక్యప్రతాప్ కోసం పోలీసులు గాలిస్తున్న క్రమంలో రాజకీయ బలంతో తప్పించుకుని తిరుగున్నట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు.



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,820
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,560

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	24
తిరుపతి	37	25
తిరుమల	32	21
గూడూరు	38	27
నగరి	37	26

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని రైల్వే స్టేషన్‌లో సోమవారం తిరుపతి–కాట్పాడి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. ఐరాల మండలానికి చెందిన ధనుంజయ(70) వెంకట్రాది ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. మూడో ప్లాట్‌ఫామ్‌పై ఉన్న రైలు ఎక్కేందుకు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మరణించాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో పడి యువకుడి మృతి



సాయికుమార్ (ఫైల్)

ఐరాల : మండలంలోని చెంగనపల్లెలో ఓ యువకుడు బావిలో పడి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. అబ్బుగుండు ఎస్టీ కాలనీకి చెందిన నాగయ్య, ధనమ్మ దంపతుల కుమారుడు పి.సాయికుమార్(20) కూలి పనులు చేసుకునేవాడు. గత నెల 29వ తేదీన అమ్మమ్మ ఊరు గోవిందరెడ్డిపల్లెకు వెళ్లి వస్తానని బయలుదేరాడు. అయితే చెంగనపల్లెలో ప్రదర్శిస్తున్న వీధి నాటకం చూసేందుకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో బహిర్భూమికి సమీపంలోని వ్యవసాయం పొలంలోకి వెళ్లాడు. రాత్రి కావడంతో ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న బావిలో పడిపోయాడు. సోమవారం గ్రామానికి చెందిన రైతు మొగిలప్ప బావి వద్దకు వెళ్లగా సాయికుమార్ మృతదేహం తేలుతూ కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించనున్నారు. మృతుడి తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కలెక్టరేట్ 'స్పందన'కు 286 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ వెంకటేశ్వర్



కలెక్టరేట్ వద్ద అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మొత్తం 286 వినతులు వచ్చాయి. జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ క్రమంలో రూ.55 కోట్ల విలువైన వక్ఫ్‌బోర్డు ఆస్తులు ఆక్రమణకు గురైనట్లు ఆల్ ముస్లిం కమిటీస్ నాయకులు మహబుబ్, సాధిక్, హిదాయత్ ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఏపీ ముస్లిం వక్ఫ్ భూముల పరిరక్షణ కమిటీ పేరుతో కొందరు పలమనేరు, రొంపిచెర్ల, నాగమంగళం, చిత్తూరు, ఇరువారం, కట్టమంచి తదితర ప్రాంతాల్లో 22 ఎకరాలను కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. జేసీ వెంకటేశ్వర్ స్పందిస్తూ దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని పలమనేరు, చిత్తూరు ఆర్డీఓలను ఆదేశించారు.

వీఆర్‌ఓ ఆత్మహత్యాయత్నం

పెనుమూరు(కార్వేటినగరం) : కలికిరి సచివాలయంలో వీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న గణేష్ ఆదివారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. వెదురుకుప్పం మండలం బొంతివంకకు చెందిన గణేష్‌ను కలికిరి గొల్లపల్లెకు చెందిన యుగంధర్ అనే వ్యక్తి 5 నెలలుగా తన భూమి పట్టాను ఆన్‌లైన్ చేయాలని వేధిస్తున్నాడు. రికార్డులు సక్రమంగా లేవని, ఆన్‌లైన్ చేయడం కుదరదని గణేష్ ఎంత చెప్పినా వినేవాడు కాదు. అలాగే లేనిపోని ఆరోపణలతో తరచూ స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేవాడు. దీంతో ఆందోళన చెందిన వీఆర్‌ఓ పురుగుల మందు తాగేశాడు. ప్రస్తుతం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు





జస్టిస్ ఇంద్రేష్, గోవిందప్పకు తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారిని సోమవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇంద్రేష్, రీజనల్ ఆడిట్ డైరెక్టర్ గోవిందప్ప తదితరులు కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం అందించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిత్తూరు డీఏఓ రామచంద్ర, ఏఓ శ్యామసుందర్ పాల్గొన్నారు.

భార్యను చంపిన ఢిల్లీరాజు అరెస్ట్?

చిత్తూరు అర్బన్: నగరంలో మూడు రోజుల క్రితం హేమలత అనే మహిళను చంపిన భర్త ఢిల్లీరాజును పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. కొంగారెడ్డిపల్లె విద్యానగర్‌లో జరిగిన ఈ ఘటనలో పరారీలో ఉన్న ఢిల్లీరాజు చిత్తూరు పరిసరాల్లో పోలీసులకు చిక్కినట్లు సమాచారం. అయితే హత్యానంతరం పుత్తూరు పారిపోయిన నిందితుడు తన భార్యను చంపిన కత్తిని శుభ్రంగా కడిగి, రక్తపు మరకలుపడిన దుస్తులను ఉతికి ఓ కవర్‌లో పెట్టుకున్నట్లు తెలిసింది. నిందితుడిని పోలీసులు లోతుగా విచారించిన తర్వాతే అరెస్ట్ చూపించనున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరిలో సోమవారం విద్యుదాఘాతంతో ఒకరు గాయపడ్డారు. వివరాలు.. తగ్గువారిపల్లెకు చెందిన రాజా అనే కూలీ ఓ ఇంటికి సెంట్రింగ్ పనులు చేస్తుండగా సమీపంలోని 11 కేవీ విద్యుత్ తీగలు తగిలాయి. కరెంట్‌షాక్‌తో తీవ్రంగా గాయపడిన రాజాను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్సపొందుతున్న రాజా

వేర్వేరు చోట్ల కర్ణాటక మద్యం పట్టివేత





కుప్పం : నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు, బంగారుపాళ్యంలో..

కుప్పం : పట్టణంలోని కొత్తపేటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ప్రకాష్, కుమార్ అనే ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. నిందితుల నుంచి 1,250 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.దాడిలో సెబ్ ఎస్‌ఐ వీరాస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.
చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యంలో ఎస్‌ఈబీ అధికారులు సోమవారం చేపట్టిన దాడుల్లో 135 టెట్రా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. నిందితుడు తేజ(19)ను అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు మోహన్‌బాబు, పృథ్వీ, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చెరువులో యువతి మృతదేహం



సంగీత (ఫైల్)

బైరెడ్డిపల్లె : స్థానిక పెద్దచెరువులో సోమవారం సాయంత్రం ఓ యువతి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ వెంకట నరసింహులు కథనం మేరకు.. బైరెడ్డిపల్లెకు చెందిన మార్వాడీ సేట్ బోలారామ్ కుమార్తె సంగీత (18) సెయింట్ జోసెఫ్ చర్చిలో నిర్వహిస్తున్న టైలరింగ్ తరగతుల్లో శిక్షణ పొందుతోంది. సోమవారం కూడా రోజులానే టైలరింగ్ క్లాస్‌కు వెళ్లింది. ఈక్రమంలో సాయంత్రం వాకింగ్ చేస్తున్న కొందరు యువకులు చెరువులో నీటిపై తేలుతున్న యువతి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. సంగీతగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరి పురపాలక సంఘ కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.2555/2022/ఇ 1 తేది: 03.04.2023

ఆసక్తి వ్యక్తీకరణ నోటీసు (EOI)

నగరి పురపాలక సంఘమునకు సంబంధించిన 1) Amrut 2.O , 15వ ఆర్థిక సంఘం మరియు మున్సిపల్ నిధులు (రూ.3.34+12.36=15.70 కోట్లు) లకు సంబంధించిన పైపులైన్లు, మైయిన్ పైపులైన్లు మరియు ESLRs లకు డి.పి.యార్ ను తయారు చేసి ఇచ్చుటకు, 2) సర్వే నెం.99-8లో గల ఎ.0.84 సెంట్లలలో మునిసిపల్ ఆఫీసు భవనమును నిర్మించుటకు ప్లాను, టైప్ డిజైన్, ఎలివేషన్ మరియు పూర్తి అంచనాలతో కూడిన డి.పి.యార్ తయారు చేసి ఇచ్చుటకు ఆసక్తి వ్యక్తీకరణ తెలుపవలసినదిగా అనుభవము కలిగిన కన్సల్టెన్సీ ఏజెన్సీ వారిని కోరడమైనది. సదరు ప్రతిపాదనలు తేది: 17.04.2023న సాయంత్రము 04.00 గంటల లోపు సీల్డ్ కొటేషన్లు అందజేయవలెను. ఇంకనూ ఏమైనా సాంకేతిక అంశముల కొరకు పురపాలక సంఘ కార్యాలయములోని ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు. (ఎలాంటి ముందస్తు ఉత్తర్వులు తెలుపకుండా పై తెలిపిన పనులకు సంబంధించిన మార్పులు / రద్దు పరిచే పూర్తి అధికారములు కమీషనరు వారికి కలవు)

సం/- **కమిషనరు,** నగరి పురపాలక సంఘము